క్లుప్తంగా

ప్రశాంతంగా జీవించాలి



పెర్కిట్(ఆర్మూర్): వృద్ధాప్యంలో యోగా, వ్యాయామంతో పాటు ఆధ్యాత్మిక జీవితం గడుపుతూ వృద్ధులు ప్రశాంతంగా జీవించాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు ఐడెంటీ కార్డులతో పాటు చేతి కర్రలను అందజేశారు. కార్యక్రమానికి ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 60 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు సీనియర్ సిటిజన్ ఫోరంలో సభ్యులు కావాలన్నారు. అలాగే ఇంట్లో కుమారులు, కోడళ్లు ఇబ్బందులకు గురి చేస్తే డయల్ 100కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు మల్యాల పోశెట్టి, రామ్మూర్తి, పీఎస్ మల్లయ్య, ఎల్ పోశెట్టి, డీ నారాయణ వర్మ, గంగాధర్, జిందం నరహరి తదితరులున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



ఆర్మూర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం రైల్వేలైన్ల పనులకు నిధులు కేటాయించి పనులు వేగవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యాదర్శి రమేష్ బాబు అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం సీపీఎం ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. మహిళలకు నెలకు రూ. 2500, పెన్షన్లు పెంచుతామని ఇప్పటి వరకు పెంచలేదన్నారు. ఇప్పటికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పల్లపు వెంకటేష్, కుతాడి ఎల్లయ్య, గంగాధర్, నాగరాజు, సుజాత, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ మండల యూత్ కాంగ్రెస్ కార్యవర్గం ఎన్నిక



బాల్కొండ: ముప్కాల్ మండల యూత్ కాంగ్రెస్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధనుష్ తెలిపారు. యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా సింగారి హేమంత్, ఉపాధ్యక్షుడిగా మయూరు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు. యూత్ కాంగ్రెస్ సభ్యులు పాల్గొన్నారు.

సరిపడా యూరియా నిల్వలు

కమ్మర్‌పల్లి : ఈ సీజన్‌లో సాగు అవసరాలకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, ఎలాంటి కొరత లేదని కమ్మర్‌పల్లి మండల వ్యవసాయాధికారి రమ్యశ్రీ తెలిపారు. ఆదివారం మండలంలోని ఉప్లూర్, కమ్మర్‌పల్లి, హసకొత్తూర్, కోనసముందర్, కోనాపూర్ గ్రామాల్లోని పీఏసీఎస్ గిడ్డండుల్లోని ఎరువుల నిల్వలను పరిశీలించారు. రికార్డుల ప్రకారం ఎరువులు గిడ్డంగుల్లో ఉన్నాయో లేవో పరిశీలించారు. ఎరువులు అవసరమైన రైతులు తమ ఆధార్, పట్టా పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు అందించి తీసుకెళ్లాలని సూచించారు.

కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పై అనుచిత వాఖ్యలుచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సీఎంపై మరోసారి నోరు జారితే జాగ్రత్త అంటూ హెచ్చరించారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనుష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పసుపు బోర్డు చైర్మన్‌కు సన్మానం



నిజామాబాద్ రూరల్: జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డిని ఏపీలోని అల్లూరి జిల్లా పాడేరు మండల రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు గంగులయ్య, కేపీఎం పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు పాటుకూరి తిరుపతిరెడ్డి ఆదివారం అంకాపూర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. పల్లె గంగారెడ్డికి గణపతి విగ్రహాన్ని బహూకరించారు. అలాగే జక్రాన్‌పల్లి మండలం మనోహరాబాద్‌లో జేఎం కేపీఎం పసుపు రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులతో, రైతులతో పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో నాయకులు, రైతులు ఉన్నారు.

ప్రమాదకరంగా ఎస్సారెస్పీ!

- ఆనకట్టపై కుంగిన రివిట్‌మెంట్
- మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతుల డిమాండ్



ప్రాజెక్టు పక్కనే కుంగిన రివిట్‌మెంట్

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆనకట్ట రివిట్‌మెంట్ ప్రమాదకరంగా మారుతోంది. దీంతో ఆనకట్టకు గండిపడే ప్రమాదం ఏర్పడుతోంది. ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో ఆనకట్ట కోతకు గురికాకుండా బండరాళ్లతో రివిట్‌మెంట్ నిర్మించారు. ఎస్సారెస్పీకి కుడి, ఎడమవైపు కలిపి 14 కిలోమీటర్ల మేర ఆనకట్ట ఉంది. కాగా, ప్రతి సంవత్సరం ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే భారీ వరదలతో ఎస్సారెస్పీ నిండుకుండలా మారుతుంది. వరదల సమయంలో ఆనకట్టకు నీటి అలలు భారీగా తగులుతాయి. ఈ క్రమంలో రివిట్‌మెంట్ మధ్యలో ఉన్న మట్టి, ఇసుక కొట్టుకుపోవడంతో రివిట్‌మెంట్ కుంగుతోంది. ప్రతి సంవత్సరం రివిట్‌మెంట్ నిర్వహణ చేపడితే పరిస్థితి ఇలా ఉండదు. కానీ, నిర్వహణకు నిధులు లేకపోవడంతో అధికారులు ఎలాంటి మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో రోజురోజుకూ ఆనకట్ట పరిస్థితి ప్రమాదకరంగా మారుతోంది. ప్రాజెక్ట్ నిర్మాణ కాలం తర్వాత 2017 సంవత్సరంలో మాత్రమే మరమ్మతులు చేపట్టారు. అది కూడా పూర్తిస్థాయిలో కాదు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి రివిట్‌మెంట్ మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

గండి పడే ప్రమాదం ..

ఆనకట్ట రివిట్‌మెంట్ కుంగిన ప్రాంతంలో నీటి అలలతో మరింత ఒత్తిడి పెరుగుతుంది. దీంతో రివిట్‌మెంట్ లోపలికి నీరు వెళ్లి ఆనకట్టకు గండి పడే ప్రమాదం ఉంటుంది. అదే కనుక జరిగితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

ప్రతిపాదనలు పంపించాం..

రివిట్‌మెంట్ మరమ్మతుల కోసం రూ. 17.8 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. మరమ్మతుల అవసరాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరుకాగానే పనులు చేపడుతాం. – వంశీ, ఏఈఈ, ఎస్సారెస్పీ

కూరగాయలు కొనలేం.. తినలేం..

మధ్యతరగతి కుటుంబాలకు భారంగా ధరలు

ఆర్మూర్ టౌన్ : కూరగాయల ధరలు మధ్యతరగతి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కూరగాయల సాగు తగ్గిపోవడంతో పాటు డిమాండ్‌కు తగ్గిన ఉత్పత్తి లేకపోవడంతో వ్యాపారులు ధరలను అమాంతం పెంచుతున్నారు. కూరగాయలు కొనలేని పరిస్థితి నెలకొంది. రూ. 200 తీసుకెళ్తే నాలుగు రకాల కూరగాయలు వస్తున్నాయని మధ్యతరగతి ప్రజలు వాపోతున్నారు. పెరిగిన ధరలతో ప్రస్తుతం పప్పుతో సరిపెట్టుకుంటున్నారు. ప్రస్తుతం శ్రావణమాసం కావడంతో పెళ్లిళ్లు, వ్రతాల నేపథ్యంలో కూరగాయల రేట్లు మరింత పెరగనున్నాయి. దీంతో వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్మూర్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కిలోకు..	రూపాయల్లో..
మిర్చి	100
టమాట	40
బీరకాయ	80
దొండకాయ	70
బెండకాయ	60
గోబీ పువ్వు	100
వంకాయ	60
ఆలు	50
చిక్కుడుకాయ	70
మునగకాయ(1)	10



ఆర్మూర్ రైతుబజార్‌లో విక్రయిస్తున్న కూరగాయలు

ఏం కొనలేకపోతున్నాం

కూరగాయల ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో ఏమి కొనలేకపోతున్నాం. ఏం తినాలో కూడా అర్థం కావడం లేదు. మొన్నటి వరకు కిలో వచ్చే కూరగాయలు ఇప్పుడు పావు కిలో వస్తున్నాయి. దీంతో ఏం కొనాలో తోచడం లేదు. – అశ్విని, ఆర్మూర్

నాలుగు రకాల కూరగాయలు వస్తున్నాయి

మొన్నటి వరకు రూ.200 తీసుకువెళ్తే పది రకాల కూరగాయలు వచ్చేవి. ప్రస్తుతం నాలుగు నుంచి ఐదు రకాల కూరగాయలు వస్తున్నాయి. – మధు, ఆర్మూర్

కంకర పరిచి.. వదిలేశారు



బోదేపల్లి ఎక్స్ రోడ్డు నుంచి గ్రామం వరకు కంకర వేసి వదిలేసిన రోడ్డు



బాల్కొండ శివారు నుంచి కిసాన్‌నగర్ వరకు..

బాల్కొండ : బాల్కొండ మండల పరిధిలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణ పనులతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బాల్కొండ మండల కేంద్రం శివారు నుంచి మండలంలోని కిసాన్‌నగర్ దుబ్బాప్రాంతం వరకు పాత జాతీయ రహదారి 44 ను విస్తరించేందుకు గత ప్రభుత్వ హయాంలో రూ. 2.4 కోట్ల నిధులు మంజూరు చేశారు. పనులు ప్రారంభించి.. కంకర వేసి వదిలేశారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాత జాతీయ రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. ఆర్టీసీ బస్సులు ఈరోడ్డు గుండానే ప్రయాణిస్తాయి. బాల్కొండ మండలం బోదేపల్లిలో గ్రామ ఎక్స్ రోడ్డు నుంచి లోపలి వరకు రోడ్డు విస్తరించుటకు గత ప్రభుత్వ హయంలోనే రూ. కోటి మంజూరయ్యాయి. పనులు ప్రారంభించి కంకర వేసి వదిలేశారు. కంకర రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు, ఉన్నత అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అలుగు పారుతున్న రుద్రూర్ చెరువు



చెరువులకు జలకళ

రుద్రూర్: మండలంలో చెరువులు జలకళ సంతరించుకున్నాయి. గత మూడు రోజులుగా కురిసిన వర్షానికి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో రుద్రూర్ చెరువు నిండుకుండను తలపిస్తోంది. దీంతో మిగులు జలాలు అలుగు ద్వారా కాటి వాగులోకి ప్రవహిస్తున్నాయి. మండలంలో పది చెరువులు ఉండగా చిక్కడపల్లి, కొందాపూర్, అంబం (ఆర్), రాణంపల్లి గ్రామ చెరువు, కొత్తకుంట చెరువు, రుద్రూర్ పెద్ద చెరువులు పూర్తి స్థాయిలో నిండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సాగు నీటి బెంగ తీరింది.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి భూమి పూజ



నందిపేటలో మాట్లాడుతున్న మంగి రాములు

నందిపేట్ (ఆర్మూర్): నందిపేటలోని శ్రీ కేదారేశ్వర ఆశ్రమంలో నిత్యాన్నదానం మండప నిర్మాణం కోసం ఆదివారం ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహరాజ్ భూమి పూజ చేశారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కాంగ్రెస్ నేత పి. వినయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగి రాములు మహరాజ్ మాట్లాడుతూ భక్తుల సహాయ సహకారాలతోనే ఆశ్రమం దినదిన అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ ఆశ్రమ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ఎమ్మెల్సీ అంజి రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఆశ్రమాలు ఉండడం హిందూ జాతికి ముఖ్యమని చెప్పారు. వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆశ్రమ అభివృద్ధికి తాను ఎప్పుడు ముందుంటానన్నారు. నిత్యాన్నదాన మండప నిర్మాణం కోసం రూ.21 లక్షలు మంజూరు చేయించే బాధ్యత తనదన్నారు. ఈ ఆశ్రమంలో త్వరలో నిర్మించబోతున్న ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలపై పోరాటానికి ముందుంటా

నిజామాబాద్ అర్బన్: ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేయడానికి తాను ముందుంటానని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అన్నారు. వ్యాస మహర్షి జయంతి పురస్కరించుకుని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువందనం కార్యక్రమంలో భాగంగా వివిధ మండలాలకు చెందిన ఉపాధ్యాయులను ఆదివారం జిల్లా కేంద్రంలోని బస్వాగార్డెన్‌లో ఘనంగా సన్మానించారు. జిల్లాలోని ప్రతి కేజీబీవీ నుంచి ఒక్క ఉపాధ్యాయుడిని ఎంపిక చేసి సన్మానించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధించేలా టీచర్లు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. తపస్ జిల్లా అధ్యక్షుడు బద్రీనాథ్, కార్యదర్శి కృష్ణవేణి, రాష్ట్ర బాధ్యులు రామకృష్ణ, సుదర్శన్, వరప్రసాద్, శంకర్ తదితరులున్నారు.



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

అర్హులైన పేదలకు రేషన్‌కార్డులందిస్తాం



ఎడపల్లిలో లబ్ధిదారులకు రేషన్ కార్డు మంజూరుపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్ : అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులందిస్తామని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ఆదివారం ఎడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో కొత్త రేషన్ కార్డుల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు సబ్ కలెక్టర్ వికాస్ మహతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్‌కార్డులు, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి వెనువెంటనే బిల్లులు చెల్లించడం జరుగుతోందన్నారు. రేషన్ కార్డుల మంజూరులో పారదర్శకత పాటించాలని అధికారులకు సూచించారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ ఫెడరేషన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జెడ్పీ వైస్ మాజీ చైర్‌పర్సన్ రజితయాదవ్, సొసైటీ చైర్మన్ పోలమల్కారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్, తహసీల్దార్ దత్తాద్రి, నాయకులు, పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



బాల్కొండ : బాల్కొండ మండలకేంద్రానికి చెందిన ఐదుగురు బాధితులకు మంజూరైన రూ. రెండు లక్షల 18 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ఈసందర్భంగా చెక్కుల మంజూరుకు కృషి చేసిన బాల్కొండ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు అర్వింద్, నాయకులు కుందారపు శ్రీనివాస్, యూనిస్, విద్యాసాగర్, మజార్, ఇమ్రాన్, రవి తదితరులు పాల్గొన్నారు.

మంచు శివలింగాన్ని దర్శించుకున్న ఆర్మూర్‌వాసులు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ప్రాంత వాసులు ఈనెల 24న అమర్నాథ్ యాత్రకు బయలుదేరారు. మొత్తం పది మంది గ్రూప్‌తో వెళ్లి బల్తాల్‌బేస్ క్యాంప్‌కు చేరుకొని అక్కడ ఆర్‌ఎఫ్‌ఐడీ కార్డ్స్ తీసుకొని ఆదివారం అమర్నానాథ్‌లోని మంచుశివలింగాన్ని దర్శించుకున్నట్లు తెలిపారు. చెరుకు పృథ్వీరాజ్, వెంకటరామిరెడ్డి, రేవతిగంగాధర్, రమేష్, మల్లయ్య, లింగారెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించాలి



పీజీహెచ్‌ఎం ఇల్తెపు శంకర్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్ : విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. సాలూర మండల కేంద్రానికి చెందిన పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, రెంజల్ మండలంలోని నీలా జెడ్పీహెచ్ఎస్ పీజీ హెచ్‌ఎం ఇల్తెపు శంకర్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ ఆత్మీయ సమ్మేళనం, సన్మాన కార్యక్రమాన్ని ఆదివారం ఎడపల్లిలోని సరయూ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఉద్యోగులు, రైతులు ప్రభుత్వానికి రెండు కళ్లలాంటి వారని పేర్కొన్నారు.అనంతరం హెచ్‌ఎం ఇల్తెపు శంకర్ - శారద దంపతులకు ఎమ్మెల్యే సన్మానించి అభినందించారు.పీఆర్‌టీయూ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు, ఉపాధ్యాయులు శంకర్‌ను సన్మానించారు. సబ్ కలెక్టర్ వికాస్ మహతో, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్, రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ ఫెడరేషన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి, నిజామాబాద్ ఏఎంసీ మాజీ చైర్మన్ నగేష్ రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్, వైస్ చైర్‌పర్సన్ రజిత యాదవ్, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండు లక్ష్మణ్, దామోదర్‌రెడ్డి,జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్ రెడ్డి, కిషన్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కుషాల్, నాయకులు సోమలింగం గౌడ్, ఎంబెల్లి శంకర్, కిషోర్, హనుమంతు, జలందర్, వెంకటేశ్వర్ గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘాల కార్యవర్గాల ఎన్నిక





ఆర్మూర్‌లో ఎన్నికైన కార్యవర్గ సభ్యులు, ముప్కాల్‌లో ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని పద్మశాలి సంఘంలో ఆదివారం 8తర్పల పద్మశాలి సంఘాలతో పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మ్యాక మోహన్‌దాస్, ప్రధానకార్యదర్శి కొక్కుల రమకాంత్, కోశాధికారి బత్తుల భాస్కర్, సర్వసమాజ్ ప్రతినిధిగా కొక్కుల విద్యాసాగర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మోహన్‌దాస్ మాట్లాడుతూ.. పద్మశాలి సంక్షేమానికి పాటుపడుతానని, పట్టణ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు పూర్తి చేయుటకు కృషి చేస్తామన్నారు. కార్యాక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ త్రివేణి గంగాధర్, చిట్ల ప్రకాష్, తాళ్ల హరిచరణ్, చొకలింగం, అంబల్ల శ్రీనివాస్, చిట్ల యగ్నేష్, రుద్ర రాజేశ్వర్, ఆడెపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్‌లో..

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం పంథా-2 నూతన కార్యవర్గాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దుంపేట లక్ష్మీరాజం, ఉపాధ్యక్షుడిగా జిజ్జి సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా జక్కుల జీవన్, సంయుక్త కార్యదర్శిగా చిలివేరి గంగాధర్, కోశాధికారిగా దొంతుల శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల మధ్య నవనాథుల విగ్రహాలు



ఆర్మూర్: ఆర్మూర్ పట్టణానికి తొమ్మిది మంది సిద్దుల కారణంగా నవనాథపురంగా పేరు వచ్చింది.నవనాథ సిద్దుల గుట్టపైకి ఘాట్ రోడ్డు నిర్మాణాన్ని మాజీ సర్పంచ్ రాంచందర్ హండే చేపడితే, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక నిధులతో ఘాట్ రోడ్డును అభివృద్ధి చేసి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దారు. ఘాట్ రోడ్డు ప్రారంభంలో ఈ నవనాథుల విగ్రహాలను ప్రతిష్ఠించి స్థల పురాణాన్ని పర్యాటకులకు తెలిసేలా పాలకులు చర్యలు తీసుకున్నారు. ఘాట్ రోడ్డు మరమ్మతుల సమయంలో అక్కడి విగ్రహాలను తొలగించి పిచ్చి మొక్కల మధ్య ఉంచారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రతిష్ఠించిన నవనాథుల విగ్రహాలకు అడ్డంగా వ్యాపార ప్రకటనలకు సంబంధించిన బోర్డులు పెట్టి వాటిని శిథిలం చేస్తున్నా పట్టించుకొనేవారు లేరు. అధికారులు స్పందించి నవనాథుల విగ్రహాలను గౌరవప్రదమైన స్థానంలో ప్రతిష్ఠించాలని పట్టణవాసులు కోరుతున్నారు.